# ప్రజా విముక్తి ప్రదాత

## డా.బి.ఆర్.అంబేడ్కర్



మూలం

డా. భదంత ఆనంద కౌసల్యాయన్

స్వేచ్ఛానుసరణ

**గౌరవ్**

## ప్రజా విముక్తి ప్రదాత
## డా.బి.ఆర్.అంబేడ్కర్

హిందీ మూలం

**డా.భదంత ఆనంద కౌసల్యాయన్**

ఆంగ్లం

**బిక్కు చంద్రబోధి**

తెలుగు

**గౌరవ్**


కాపీలెఫ్ట్

**సర్వహక్కులు సమాజానివి**



ప్రచురణ

**బహుజన బౌద్ధ సమాఖ్య**

**అక్టోబర్ 14, 2023**

మూల్యం

**అమూల్యం**



వివరాలకు

gouravmeka@gmail.com




### అంకితం

భావోద్యమ మేధావి, అసాధారణ బుద్ధిజీవి
నిరంతర సత్యాన్వేషి,
సాంస్కృతిక ధిక్కార స్వరం
అతి చిన్న వయసులోనే అశేష ప్రజానీకాన్ని
అనితర సాధ్యమైన రీతిలో ప్రభావితం చేసి
పిన్న వయసులోనే మరణించిన మానవవాది.
వ్యక్తిగతంగా నన్నెంతో ప్రభావితం చేసిన
కవి.

**'హెన్రీ లూయిస్ వివియన్ డిరోజియో'**

స్మృతికి

## అనువాదకుడి మాట

భదంత ఆనంద కౌసల్యాయన్ రచించిన బౌద్ధ వ్యాసాల సంపుటి, డి.సి.అహిర్ సంపాదకునిగా నాగపూర్లోని బుద్ధభూమి ప్రకాశన్ తరపునుండి1997 లో ప్రచురించారు. పది బౌద్ధ సంబంధ విలువైన వ్యాసాలున్న ఈ పుస్తకం చివరన అనుబంధంగా, ఆనంద కౌసల్యాయన్ ప్రసిద్ధ హిందీ వ్యాసం 'యాదే బాబా నా హోతే' కి భిక్కు చంద్ర బోధి ఆంగ్లంలో అనువదించిన **Dr. Ambedkar : The Liberator** ఇచ్చారు.

బాబాసాహెబ్ అంబేద్కర్ శతజయంతి సందర్భంగా 1991, ఏప్రిల్14న, ఇంటర్నేషనల్ నెట్వర్క్ ఆఫ్ ఎంగేజ్డ్ బుద్దిస్ట్స్ తరపున ప్రత్యేక సంచిక (సావనీర్) లో ఎస్. శివరాక్సా ప్రచురించిన ఈ వ్యాసాన్ని అడ్వకేట్ బాపూరావ్ పాఖాడే అభ్యర్ధన మేరకు సరిచూసి కొద్దిపాటి మార్పులు చేసినట్లు ఆ పుస్తకానికి రాసిన ముందుమాటలో డి. సి. అహిర్ పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్ లోని మండాలా జిల్లాలో నైన్ పూర్ కి వెళ్ళాల్సి ఉండి ఎక్కాల్సిన రైలు తప్పిపోయి సమయం ఉండటంతో అనుకోకుండా ఒకపూట నాగపూర్ లో ఉండాల్సి వచ్చింది. అప్పుడు దీక్షాభూమి సందర్శనలో భాగంగా భదంత ఆనంద కౌసల్యాయన్ రచించిన ఈ పుస్తకం లభ్యమైంది. ఆయన రచనలు ఒకట్రెండు తెలుగు లోకి వచ్చాయని తెలుసు కానీ ఈ వ్యాసం వచ్చిందో లేదో తెలీలేదు. వచ్చి ఉన్నా మరోసారిలా ప్రయత్నించడం మంచిదేననే భావనతో తెలుగు చేయడం జరిగింది.

నిజానికి, ఈ బౌద్ధ వ్యాసావళి మొత్తం చాలా విలువైనదే. అయినప్పటికీ నా అశక్తతరీత్యా అనుబంధంగా ఉన్న ఈ చిన్న వ్యాసాన్ని మాత్రం ఎంచుకుని బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధధర్మ స్వీకార స్మృతి సందర్భంగా తెలుగులో తీసుకు వస్తున్నాను. ఈ అనువాదానికి అనుబంధంగా గతంలో నేను సామాజిక మాధ్యమాల్లో రాసిన భదంత ఆనంద కౌసల్యాయన్ గురించిన సంక్షిప్త పరిచయాన్ని ఇస్తున్నాను. ఆంగ్ల బౌద్ధ వ్యాస సంపుటిలో డి.సి.అహిర్ ఆనంద కౌసల్యాయన్ గురించి పరిచయం చేసారు.

ఇందులోని అనువాద దోషాలకూ, వాక్య సమన్వయ లోపాలకూ పూర్తి బాధ్యత నాదే.స్వతంత్ర సామాజికకార్యకర్తగా, భౌద్ధాభిమానిగా చేస్తున్న స్వల్పమైన యత్నాలే ఇవి తప్పా అనువాద ప్రక్రియలో నాకు ప్రత్యేకమైన శిక్షణ లేదని మనవి. మా ఇతర ప్రచురణలు కొన్ని ఆసక్తి ఉన్న వారికోసం అంతర్జాలంలోని **Internet Archives** లో అందుబాటులో ఉన్నాయి. విమర్శలకు ఆహ్వానం.

# ప్రజా విముక్తి ప్రదాత

## డా. బి. ఆర్. అంబేద్కర్

డా. అంబేద్కర్ వైశ్రాయ్ కార్యవర్గ సభ్యునిగా ఉన్న కాలంలో ఒకసారి భారతీయ బౌద్ధ భిక్షువుల్ని కలవాలనుకున్నారు. అది తెలిసి, ఒకరోజు ఆయన్ని చూడాలని నేను వెళ్ళాను. “కేవలం కొద్దిమంది భిక్షువులు మాత్రమే ఉన్నారు, వాళ్ళలో నేనూ ఒకడిని. నేను మీకు ఏ విధంగా సాయపడగలనో చెప్పండి.” అని ఆయన్ని అడిగాను.

అప్పటికాయన ఆరోగ్యం బాగోలేదు. వైద్యులు ఆయన్ని ఎక్కువగా మాట్లాడొద్దని చెప్పారు. ఐతే, మా సంభాషణ బౌద్ధం గురించి కావడంతో ఆయనసలు సమయమే మర్చిపోయారు. చివరిగా తన దగ్గరున్న బుద్ధప్రతిమని చూడమని కోరారు. గదిలో ఒక ప్రత్యేకమైన అరలోని గుప్తులకాలం నాటి అరుదైన బుద్ద ప్రతిమ ఉంది. అదాయన ఏ భంగిమలోనిదని అడగ్గా, కూర్చుని ఉపదేశిస్తున్న శైలిలో ఉందనిచెప్పాను. “మానవాళికి మంచి మార్గం చూపే బుద్ధ ప్రతిమ నాకు ఇష్టమ”ని ఆయన అన్నారు.అప్పటివరకూ బౌద్ధం పట్ల ఆయనకి ఉన్న అవ్యక్తమైన భక్తిపారవస్యాన్ని నేను అసలు గమనించనే లేదు.

మరోసారి నేను డా. అంబేద్కర్ ను ఢిల్లీలోని బిర్లామందిరం దగ్గర ప్రఖ్యాత వితరణశీలి, జుగల్ కిషోర్ బిర్లా గారి సమక్షంలో కల్సుకున్నా.బిర్లా బౌద్దారామ నిర్మాణాన్ని ప్రస్తావిసూ, “ ఇది భారతదేశంలోనే మహొన్నతమైన వ్యక్తి కోసం” అన్నాడు. వెంటనే అంబేద్కర్, “ఇదెంత పనికిమాలిన పనంటే,



ఇండియా నుంచి అంత మహొన్నతమైన వ్యక్తి (బుద్దుడ్ని) బూజులున్న అలమారాలో కుక్కి బిగించి, పిశాచాలకోసం ఈ మహత్తర నిర్మాణం వెలుగొందుతోంది.’ ’అన్నారు. అప్పటికి దశాబ్దాలుగా బౌద్ధాన్ని అధ్యయనం చేస్తున్న నాకు కూడా ఆయన దృక్పథం ఎంతో కొత్తగా కనబడింది. **1950** లో శ్రీలంకలో ప్రపంచ బౌద్ధ సమ్మేళనానికి డా. అంబేద్కర్ గౌరవ అతిథిగా విచ్చేసారు. కొలంబోలో ఆయన ప్రసంగాల్ని అప్పటికే విని ఉన్న నేను పాత రాజధాని నగరం కేండీలో ఆయన ఉపన్యాసం వింటానికి వెళ్ళాను. ఐతే, అస్వస్థత కారణంగా ఆయన ప్రసంగం రద్దైంది.అప్పుడు ఆయన విడిది చేసిన హొటల్లో అంబేద్కర్ ని కల్సుకుని చాలాకాలంగా నా మనసులోని ప్రశ్నల్ని నివృత్తి చేసుకున్నాను.

“డాక్టర్ సాహెబ్ నేను ఇండియన్ వార్తాపత్రికల్లో మీరు న్యూఢిల్లీలోని బుద్ధ విహారంలో త్రిశరణాల్నీ, పంచశిలల్ని

ప్రస్తుతించారని చూసాను. డిప్యూటీ కమీషనరు మన న్యాయ శాఖామాత్యులు బౌద్ధునిగా మారారా అనడిగితే నేను 'అవును' అనే చెప్పాను. కానీ, ఇక్కడి పత్రికలు మీరింకా బౌద్ధాన్ని 'అధ్యయనం' చేస్తూనే ఉన్నారని రాస్తున్నాయ్.

మనందరం ఎప్పటికీ అధ్యయనంచేసి జ్ఞానార్జన చేయాల్సిన మాట నిజమే ఐనప్పటికీ, నేను వినమ్రుడ్నై మిమిల్ని కోరేదేమంటే, తమరు ఈ విషయంలో ఇంకా అధ్యయనం దశలోనే ఉన్నారా? లేక బౌద్ధునిగా మారారా? ఈ ప్రశ్న కూడా మిమ్మల్ని అడగడానికి ప్రధానకారణం, ఎవరైనా నన్ను అడిగితే వారికి సరైన జవాబు నేను చెప్పాల్సి ఉందని మాత్రమేనని మనవి. దానికి డా. అంబేద్కర్ జవాబిచ్చారు : ఇతరులు ఈ విషయాన్ని అర్థం చేసుకున్నా, లేదా అపార్థం చేసుకొన్నా మీరు మాత్రం హర్షిస్తారని భావిస్తున్నాను. నేను కేవల బౌద్ధుడ్ని కాను నేనో బౌద్ధ బోధకుడ్ని, ప్రచారకుడ్ని కూడా.

ఈ సమయంలో నన్ను నేను బౌద్ధుడిగా ప్రకటించుకుంటే కనుక, జనాలు నా ప్రజలతో, ''ఆ అంబేద్కర్ బౌద్ధుడిగా మారిపోయాడు ఇక ఇప్పుడు ఆయనతో మీకేం పని?'' అంటారు. అందుకే, కొద్దికాలం వరకూ నిర్దిష్టమైన రీతిలో బౌద్ధధమ్మ ప్రచారాన్ని చేయడానికి నిర్ణయించు కున్నాను. ఎప్పుడైతే అధిక సంఖ్యలో జనులు నా వెంట నడవడానికి పూనుకుంటారో అప్పుడు నేను నా నిర్ణయాన్ని బహిరంగంగా ప్రకటిస్తాను.
డా. అంబేద్కర్ ఆదర్శం బోధిసత్వుని కోవలోది.అది కేవలం ఆయన వ్యక్తిగత విషయం కాదు. ఆయన దృష్టిలో బౌద్ధం మొత్తం సమూహాన్నిసమున్నతంగా తీర్చిదిద్దగలదు. ఆ కారణం చేతనే ఆయన తన ప్రకటన వాయిదా వేసారు.

ఖాట్మాండ్ లో ప్రపంచ బౌద్ధ సమ్మేళనమప్పుడు విదేశీ ప్రతినిధులకు స్థానిక ప్రదేశాల పర్యటనకు ఏర్పాట్లు చేసారు. ప్రసిద్ధి చెందిన పశుపతినాథ దేవాలయం సందర్శన కూడా అందులో భాగం.ఐతే, ఆ వచ్చే సందర్శకుల్లో డా. అంబేద్కర్ ఉంటారనే సంగతి దేవాలయ పురోహితుడ్ని కలవరపెట్టింది. ఖాట్మండులోని సాంప్రదాయక పద్ధతులు ఫలితమది. ఒకవేళ అంబేద్కర్నీ, అతని అనుయాయుల్ని ఇప్పుడు ఆలయం లోకి రానిస్తే భవిష్యత్తులో బౌద్ధులుగా మారిన ఇతరేతర అస్పృశ్యుల్ని కూడా రానివ్వాలని తికమకపడ్డారు.

అలాకాక అంబేద్కర్ని కనుక అడ్డుకుంటే, భూ ప్రపంచంలో బౌద్ధులుగా మారిన హిందూవులు అందరికీ ఏం సమాధానం చెప్పగలరు? ఈ పరిస్థితుల్లో డా. అంబేద్కర్ ఆరోగ్యం కారణంగా ఆయనీ సందర్శనలో పాల్గొనలేదు. ఐనప్పటికీ, అంబేద్కర్ అనే పేరే పూజారుల్ని, పురోహిత మఠాధిపతుల్ని భయంకంపితుల్ని చేసి, ఆయనెక్కడ వచ్చేస్తారోనని హడలగొట్టింది.
నేపాల్ నుండి తిరిగొచ్చాక ఒక సందర్భంలో సారనాథ్ లో నేను బాబాసాహెబ్ ని కలుసుకున్నప్పుడు అడిగాను, ''మీరు హిందువులే అయినప్పటికీ అస్పృశ్యులు కాబట్టీ మీరు బౌద్ధులుగా మారినప్పటికీ, మా దేవాలయాల్లోకి మిమ్మల్ని రానివ్వబోం.'' అనే వారి పట్ల మీ వైఖరి ఏమిటి. ఎందుకనంటే

వీళ్ళే మళ్ళీ చైనా, జపాన్, టిబెట్, బర్మా, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాల ధనికులైన బౌద్ధుల్ని మందిరాల్లోకి స్వాగతించి నెత్తినపెట్టుకుంటారు. మరలాంటప్పుడు బీద భారతీయ భిక్షువుల పై ఇది వివక్షత కాదా? మన జాతీయభావనకీ, సమైక్యతకీ, మతానికీ ఇది అవమానకరం కాదా?

అంబేద్కర్ జవాబు చెప్పారు : ఏ రకమైన దేవాలయం లోకీ, మందిరంలోకీ నేను వెళ్ళను. అటువంటి ప్రదేశాలు పవిత్రమని భావించను. నేను బౌద్ధంలో ఆశ్రయం పొందాను. బుద్ధుడ్ని మాత్రమే మహాత్మునిగా సేవిస్తాను. దేశీయులు,విదేశీయులైన బౌద్ధులు ఎవరైనా సరే ఆ ప్రదేశాల్ని పురాతన కట్టడాల పట్లగల జిజ్ఞాస, ఆసక్తుల వల్ల సందర్శిస్తారే కానీ పవిత్రంగా భావించి కాదు. వాటిల్లోని ప్రతిమలకి ఏ రకమైన మతసంబంధ ప్రాధాన్యత లేనప్పుడు ఎవరైనా అక్కడకి ఎందుకు వెళతారు?

ఏమాత్రం సమయం లేకుండా అవిశ్రాంతంగా డా. అంబేద్కర్ పనిచేస్తుండేవారు. అందువల్ల ఆయనకి అధిక రక్తపోటు,మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చాయి. నేపాల్ లో తలెత్తిన అస్వస్థత సారనాథ్ లో కూడా ఆయనలో అలాగే ఉంది. అణగారిన పీడిత ప్రజల బతుకుల్లో చైతన్యం రగిలించాలనే తపన మత్రం ఆయన అస్థిత్వంలో ఆరని మంటలా ఎల్లప్పుడూ రగులుతుండేది. బౌద్ధాన్ని స్వీకరించే చారిత్రక మహోత్సవంలో ఆయన ప్రసంగిస్తూ, "నేను హిందువుగా మరణించనని 21 ఏళ్ళ క్రితం ప్రకటించాను. ఆ ప్రతిజ్ఞకి కట్టుబడి ఇచ్చిన మాట ఈరోజు నిలబెట్టుకున్నాను. ఈ సందర్భంగా నన్ను నేను పునరుజ్జీవింప చేసుకోవడం సంతోషంగా ఉంది. ఒక గొప్ప నరకంలో నుంచి నేను తప్పించు కున్నాననిపిస్తోంది." అన్నారు.

ఆయన హిందూగా మరణించనని ప్రకటించాక వివిధ మతాలకు చెందిన అనేకమంది పెద్దలు ఆయన్ని కల్సుకుని వారి మతంలోకి ఆయన్ని ప్రలోభాలతో ఆహ్వానించారు. వారినందరినీ ఆయన మర్యాదపూర్వకంగా కల్సి చర్చించినా,బాబాసాహెబ్ హృదయం మాత్రం బౌద్ధం వైపే మొగ్గి ఉంది. బొంబాయిలో ఆయన తన ఇంటికి 'రాజగృహ' అని పేరు పెట్టుకున్నారు. ఆయన ఆద్వర్యంలో రూపొందిన రెండు కళాశాలలకీ'సిద్దార్థ', 'మిళింద' అనే పేర్లు పెట్టారు. **1932**లో అణగారిన వర్గాల సమావేశం ముగింపు లో ఆయన ప్రసంగిస్తూ "మహాపరినిబ్బాణ సుత్త అనే గ్రంథంలో నిక్షిప్తం చేసిన, మహాత్మాబుద్ధుడు తాను మరణిస్తూ చెప్పిన మాటలు నాకు ఈ సందర్భంలో జ్ఞాపకం వస్తున్నాయి. "మీకు మీరే ద్వీపాలుగా మారండి, మీకు మీరుగానే ఆశ్రయం పొందండి కానీ ఇతరుల నుండి ఆశించకండి. సత్యం దానికదే ప్రత్యేక దీవి వంటిదని గుర్తించండి, సత్యాన్వేషణకు మించిన ఆశ్రయం లేదని గ్రహించండి. మీలో తప్పా మీరు వెతికే సాంత్వన, ఆశ్రయం మరెవరిలోనూ దక్కదని తెల్సుకోండి." అన్నారు.
'అస్పృశ్యులెవరు?" అనే తన రచనలో అంబేద్కర్ చారిత్రక ఆధారాలు చూపుతూ, " అత్యధిక శాతం మంది అస్పృశ్యులు అంతా భారతీయ

సంస్కృతి పట్ల ప్రేమ, గౌరవంతో ఇతర మతాల్లోకి పోకుండా హిందువులచేత ద్వేషించబడిన బౌద్ధ సంతతి వారసులేనని ప్రకటించారు. కాబట్టి, అంబేద్కర్ తన బౌద్ధ ధమ్మ స్వీకారం అనేది ఏదో కొత్తదయిన పరాయి మతంలోకి వెళ్ళడం కాదనీ, అది సొంత గూటికి తిరిగి రావడమేనని అంటారు. అనేక గ్రంథాలు ఆయన రాసినప్పటికీ, దాదాపు 16 సంవత్సరాలుగా ఆయన శక్తినీ, సమయాన్నీ ధారపోసి కూడా చివరివరకూ సంతృప్తి చెందని కృషి ఒకటుంది. అదే 'బుద్ధుడు – అతని ధర్మం' పేరిట భారతీయ బౌద్ధులకే కాక, విదేశీ బౌద్ధుల్ని కూడా దృష్టిలో పెట్టుకుని బాబాసాహెబ్ రాసిన ఆంగ్ల గ్రంథం.

డిసెంబరు 5, 1956 న ఈ పుస్తకానికి ముందుమాట రాసి బాబాసాహెబ్ కన్నుమూశారు. ఆయన తన వారసత్వంగా భార్యాబిడ్డలకి ఏమి వదిలిపెట్టారో తెలీదుకానీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది బౌద్ధ అభిమానులకీ, అనుయాయులకీ మాత్రం "బుద్ధుడు – ఆయన ధర్మం" అనే అద్భుతమైన ఆచరణాత్మక అధ్యయనాన్ని ఉజ్వలంగా అందించారు.

భారతీయ సమాజం పై బాబాసాహెబ్ ఆలోచన ల ప్రభావాన్ని భవిష్యత్తే మూల్యాంకనం వేస్తుంది. కొన్నాళ్ళకి అజంతా, ఎల్లోరా గుహల్ని సందర్శించే వారు అవి ఎవరికీ చెందనివనే నిర్ణయానికొస్తారు. సారనాథ్, కుశీనగర్, బుద్ధగయ వంటి ప్రదేశాల్లో బుద్ధప్రతిమల్ని దర్శించే భారతీయులు ఆయన శిష్యగణాలన్నీ దక్షిణ – తూర్పు ఆసియా, శ్రీలంక, చైనా,జపాన్ కే పరిమితమయ్యారని అనుకుంటారు. ఈ దేశంలో ఆయన బోధించిన ధర్మానికి నిబద్ధతగా కట్టుబడి ఉన్న విధేయులు అతికొద్దిమంది మాత్రమే. డా. బి. ఆర్. అంబేద్కర్ యొక్క సన్మార్గమే లక్షలాదిమందికి మహోన్నతమైన గొప్ప వారసత్వాన్ని అందజేసింది.

ఇండియాలో బౌద్ధ సంఘం నూతనంగా స్థాపించబడింది కాన నిలదొక్కుకోడానికి కొద్దిగా సమయం పదు తుందనే విషయం రహస్యమేమీ కాదు. బౌద్ధ వికాసం కోసం కృషి చేసినవారిలో అనేకమంది మహామహులు ఉన్నారు. 19 వ శతాబ్దంలో ఈ సానుకూలమైన మార్పులో భాగస్వాములైన వారు ఎందరో. కానీ, వీటన్నింటిలోకీ కూడా ఏకవ్యక్తి సైన్యంలా బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రేరణ అసాధారణమైనది. ఆధునిక యుగంలో భారతావనిని బౌద్ధ విలువల వైపు మళ్ళించడం అనేది బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితకాలం కృషికి తలమానికమైన మహోజ్వల విజయం.ఆ వైభవోపేతమైన విశిష్ట పరంపరకి నిజమైన వారసులుగా నిరూపించుకోవల్సిన బాధ్యత మనదే.

# అనుబంధం

# మహోన్నత నవబౌద్ధుడు

## భదంత డాక్టర్ ఆనంద కౌసల్యాయన్ !!!



"నేను మరణించాక నా సమాధి పై బాబా సాహెబ్ అంబేద్కర్ కలలకి అను గుణంగా ఈ భారతదేశాన్ని నిర్మించే సమరంలో అమరుడైన ఒక సైనికుడి స్మృతి చిహ్నమిదని వ్రాయండి !" భదంత డాక్టర్ ఆనంద కౌసల్యాయన్. భారతీయ బౌద్ధ సారస్వత కేతనాన్ని సమున్నతంగా నిలిపిన అరుదైన మేధావి. బౌద్ధ ధర్మానికి కట్టుబడి జీవిస్తూ కూడా ప్రజాక్షేత్రంలో సామాజిక కార్యకర్తగా మనగలిగిన విలక్షణ దార్శనికుడు. 20వ శతాబ్దపు అత్యుత్తమ బౌద్ధ ఆలోచనాపరుల్లో ఒకడు. మహా పండిత్ రాహుల్ సాంకృత్యాయన్, డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఇరువురి ఆదర్శాల మేలు కలయిక. భారతీయ సంస్కృతిలోని చింతనాత్మక బౌద్ధ వారసత్వానికి తిరుగులేని ఉదాహరణ. స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న దేశభక్తుడు. ప్రపంచంలోని అనేకానేక దేశాలు, ప్రదేశాలు తిరిగి ఆయా వివరాలు నమోదు చేసిన విస్తృత యాత్రికుడు. మూల బౌద్ధాన్ని పాళీ భాషలో అధ్యయనం చేసి సారాన్ని సామాన్యుల దరికి చేర్చడానికి విశేష కృషి చేసిన బుద్ధిజీవి. ఎన్నో ప్రజాభ్యుదయ గ్రంథాల రచయిత, స్వతంత్ర చరిత్రకారుడు,అనువాదకుడు. సంస్కరణ వాది,గాంధేయవాది, అధునాతన నవబౌద్ధుడు. ఇంకా ఎన్నో విశేషాల సమ్మేళనం ఆనంద్ కౌసల్యాయన్ అపూర్వ వ్యక్తిత్వం !

బౌద్ధంలోని మానవత్వం, గాంధీ జీ సత్యాగ్రహం, అంబేద్కర్ సోషలిజం, రాహుల్జీ కమ్యూనిజం వంటి విశిష్టమైన గుణాలను స్వీకరించి తన మార్గాన్ని సర్వోన్నతంగా తీర్చిదిద్దు కున్నాడు. బౌద్ధ సాంప్ర దాయాల్ని నేర్చుకోవడం కోసం, పరిశీలించడం కోసం శ్రీలంక, నేపాల్, బర్మా, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, లండన్ వంటి దేశా లెన్నింటినో పర్యటించాడు. ప్రపంచంలోని ప్రముఖ బౌద్ధ గురువులందర్నీ కలిసి చర్చించాడు. వివిధ రకాల సిద్ధాంతాల ఆదుపాదుల్ని పట్టి చూసాడు. ఆనంద కౌసల్యాయన్ అనితర సాధ్యమైన అధ్యయనం గురించి ఇప్పటికీ ఆయన అభిమానులు కథలుగా చెప్పుకుంటారంటే అతిశయోక్తి కాదు. అంత లోతుగా, విస్తృతంగా బౌద్ధ వ్మాయాన్నీ, భారతీయ సాహిత్య ధోరణులను చదివిన బౌద్ధ పండితులు అరుదు. ఆయన రచనలు చూస్తే ఈ విషయం తెలుస్తుంది. అణగారిన వర్గాల ప్రజలకి వెన్నుదన్నుగా, బహుజన హితం కోసం కట్టుబడి వ్యక్తిగత జీవితాన్ని సైతం త్యాగం చేసిన నిజమైన పరివ్రాజకుడు కౌసల్యాయన్ !

పంజాబ్ లో అంబాలా దగ్గర సోహనా గ్రామంలో 1905 లో హరనామ్ దాస్ గా

జన్మించిన ఆయన లాహోర్ నేషనల్ కాలేజీలో బి. ఎ. చదివాడు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నాడు. రాహుల్ సాంకృత్యాయన్ స్ఫూర్తితో అధ్యయనం, దేశాటనాల్ని సాధనంగా చేసుకుని మొదట విశ్వనాథ గా తర్వాత ఆనంద కౌసల్యాయన్ గా మారాడు. బౌద్ధ సాహిత్యాన్ని మధించాడు. కులతత్వాన్ని, మతోన్మాదాన్నీ, మూఢ నమ్మకాల్ని, ఛాందస భావాల్ని నిరసిస్తూ విప్లవాత్మక రచనలు చేశాడు. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాల పై తన అనుభవాలతో వ్యాసాలెన్నో రాసాడు. 'జో లిఖనా పడా' అనే గ్రంథాన్ని మహాత్మా గాంధీకి, 'బోధి జీవన పద్ధతి' అనే పుస్తకాన్ని బాబా సాహెబ్ అంబేద్కర్ కీ అంకితం ఇచ్చాడు. అంబేద్కర్ కోసం "యదీ బాబా నా హోతే" అనే అద్వితీయ రచన చేసాడు. ధమ్మ పథాన్ని హిందీ చేసాడు. ప్రముఖ అజ్ఞాతవాది, పాశ్చాత్య నాస్తిక తత్వవేత్త ఇంగర్సోల్ కృషికి వ్యాఖ్యాతగా స్వతంత్ర చింతన్, ధర్మ్ కే నామ్ పర్ మొదలైన పుస్తకాలు రాసాడు. పాల్ కారస్ రాసిన 'ది గాస్పెల్ ఆఫ్ బుద్ధా' ను హిందీలోకి అనువదించాడు. భగవద్గీత గురించి సాధికారిక విమర్శ రాసాడు. అనేక వ్యాసాలు, నవలలు, కాల్పనిక సాహిత్యం కూడా రచించాడు !

భారతదేశంలో బౌద్ధ సాంస్కృతిక వికాసానికి కృషి చేసిన ఆరుగురు మహా బిక్షువులుగా ధర్మానంద కొశాంబి, అనగారిక ధర్మపాల, రాహుల్ సాంకృ త్యాయన్, భంతే జగదీష్ కశ్యప్, బాబాసాహెబ్ అంబేద్కర్ లతో పాటు భదంత డాక్టర్ ఆనంద కౌసల్యా యన్ ని కూడా పేర్కొంటారు. అయితే, భదంత ఆనంద కౌసల్యాయన్ ని బౌద్ధ జగత్తులో నిలిపిన రెండు గొప్ప పనులు, ఒకటి బాబాసా హెబ్ అంబేద్కర్ విశిష్ట రచనయిన, 'బుద్ధుడు : అతని ధర్మం' గ్రంథాన్ని హిందీలోకి, పంజాబీ లోకి, 'రిడిల్స్ ఆఫ్ హిందూయిజం' గ్రంథాన్ని హిందీలోకి సమర్థ వంతంగా అనువదించడం. అంబేద్కర్ మహోన్నత ఆలోచనల్ని లక్షలాది మంది ప్రజలకి చేర్చడానికి ఈ మహత్కార్యం దోహదపడింది. ఇక రెండోది, ముఖ్యమైనది, దక్షిణాది భావోద్యమకారులు గుర్తించాల్సినది, ప్రఖ్యాత భావోద్యమకారుడూ, అంబేద్కర్ని ఆకర్షించిన తెలుగువాడూ, సంస్కరణ వాది ప్రొఫెసర్ పోకల లక్ష్మీ నరసు అద్భుత రచన' ది ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం' ని 'బౌద్ధ్ ధర్మ్ కా సార్' పేరిట హిందీలోనికి అనువాదం చేసి ప్రచురించడం. ప్రపంచ బౌద్ధ సాహిత్యంలోనే విశేష స్థానాన్ని పొందిన ఈ గ్రంథాన్ని హిందీ చేయడం ద్వారా, బౌద్ధాన్ని కేవలం ఆధ్యాత్మిక మతంగా కాక, మార్పుకి సారధ్యం వహించే మాధ్యమంగా, మానవ జీవన విధానాన్ని విలువలతో కూడిన ఆచరణాత్మక వైఖరితో ప్రభావితం చేసే నైతిక మానవీయ మహా మార్గంగా ప్రతిష్ఠించగలగడం ఆనంద కౌసల్యాయన్ సాధించిన విశిష్ట విజయం !

అంబేద్కర్ హఠాన్మరణం తర్వాత ముంబాయి లోని దాదార్లో ఆయన అంత్య క్రియలు ఆనంద కౌసల్యాయన్ ఆధ్వర్యంలోనే జరిగాయి. ఆ సమయంలో దీక్ష కోసం సిద్ధపడిన లక్షలాది మందిని సమన్వయపర్చిన ఘనత నిస్సందేహంగా ఆనంద కౌసల్యాయన్ దే. అంతే కాక, బాబాసాహెబ్ మరణంతో బౌద్ధ ధర్మ ప్రచారోద్యమం పై ప్రతికూల ప్రభావం పడ కుండా, నాగపూర్లోని దీక్షాభూమిని తన నివాసంగా చేసుకుని అంబేద్కర్ ఆశయాల్ని ఆచరణాత్మకంగా కొనసాగించడం కోసం, జీవితాంతం అక్కడే ఉండి బౌద్ధ ధర్మ ప్రచారం చేసిన మహోన్నత

బౌద్ధుడు ఆనంద కౌసల్యాయన్. అందుకే, ఆయన చేసిన కృషికి నివాళిగా మరణానంతరం దీక్షాభూమి లో ఆనంద కౌసల్యాయన్ విగ్రహం ఈనాటికీ ఉంది. ఇదంతా ఒకెత్తయితే, రాహుల్జీ స్ఫూర్తితో బౌద్ధ పరివ్రాజకుడిగా ఆయన చేసిన ప్రయాణాలు ఒకెత్తు. దాదాపు ప్రపంచంలోని ప్రఖ్యాత బౌద్ధ దేశాలన్నీ వెళ్ళిన ఆయన ప్రతీ దేశం గురించి కూలంకషంగా అధ్యయనం చేసి విశ్లేషిస్తూ ప్రత్యేకమైన రచనా వ్యాసంగం సృష్టించారు. రాహుల్జీ తరువాత అంతటి యాత్రా సాహిత్యాన్ని రాసిన వ్యక్తి ఆనంద కౌసల్యాయన్ ఒక్కరే. 'రాహుల్జీ బాల్ సదన్' పేరిట పిల్లల కోసం విద్యా కేంద్రాన్ని కూడా స్థాపించి కొనసాగిం చారు. ప్రయాగలోని హిందీ సాహిత్య సమ్మేళన్, వార్ధాలోని రాష్ట్రభాషా ప్రచార సమితి వంటి సంఘాల్లో చురుకుగా పాల్గొన్న కౌసల్యాయన్, సులభమైన భాషను ప్రయోగించి సగటు మనిషి హృదయంలో బౌద్ధ ధర్మాన్ని ప్రతిష్టించడమే లక్ష్యంగా చేసుకుని జీవితాంతం నిబద్ధతగా పనిచేసారు !

బాబాసాహెబ్ అంబేద్కర్ స్వప్నాల్ని నిజం చేయడానికి యుద్ధం చేసి అమరుడైన వాడ్నని ప్రకటించుకోగల ఏకైక బౌద్ధ యోధుడు కౌసల్యాయన్. కనుకనే, 'మనుధర్మ శాస్త్రాన్ని ఎందుకు దహనం చేయాల్సి వచ్చింది?" ,స్వతంత్ర చింతన, వంటి గ్రంథాల్ని రచించి అంబేద్కర్ కి మద్దతుగా ప్రచారం చేశారు. 'సులభ శైలిలో పాళీ భాష పరిచయం' వంటి అమూల్య మైన గ్రంథాలను కూడా రాసారు. తెలుగులో కూడా ఒకట్రెండు ఆయన రచనల తర్జుమా జరిగింది. హేతువాద మానవవాద దృష్టితో,తర్కబద్ధ ప్రమాణాలతో క్లిష్టతరమైన ఎన్నో తాత్విక భావనల్ని అత్యంత సులువు గా రాయడం కౌసల్యాయన్ ప్రత్యేకత. ఉత్తర భారతంలో ఈ మాత్రమైనా భావోద్యమాల ప్రభావం ఉందంటే అందుకు ఆనంద కౌసల్యాయన్ వంటివారే కారణం. భారతీయ తాత్విక ధోరణిలోని ఆరోగ్యకర అంశాల్ని కాపాడడం కోసం భదంత ఆనంద కౌసల్యాయన్ చేసిన కృషి భారతీయ బౌద్ధ సారస్వత చరిత్రలోనూ, ప్రగతిశీల ప్రజా పురోగామి క్షేత్రంలోనూ నమోదు చేయడం అవసరం. అందులో భాగంగా నవీన బౌద్ధ ప్రచారోద్య మాలు ఆయన కృషిని ఆ మేరకు గుర్తించి గౌరవించడం, అలానే నిర్మాణాత్మక ప్రజాతంత్ర భావజాలానికి తగినట్టుగా ఆయన వారసత్వాన్ని కొనసాగించడమే ఆ మహోన్నత వ్యక్తికి మనమిచ్చే చిరు నివాళి కాగలదు !

**( భదంత డాక్టర్ ఆనంద కౌసల్యాయన్** 35 వ **వర్థంతి సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో రాసిన నివాళి రైటప్.)**

**- గౌరవ్**

# ఒక తరాన్ని కదిలించిన స్ఫూర్తి దాత !

## డా.అంబేద్కర్ ని ఆకర్షించిన బౌద్ధ నేత !!

**ప్రొఫెసర్ పోకల లక్ష్మీనరసు !!!**

"కుల వ్యవస్థలోని అరిష్టాలను గుర్తించిన తొలి వ్యక్తులలో ప్రొఫెసర్ లక్ష్మీనరసు గారొకరు. ఆయన 19వ శతాబ్దికి చెందిన మహాపురుషుడు. యూరోపియన్ల అహంకారాన్ని జాతీయభావ ప్రేరణతో ప్రతిఘటించారు. సాంప్రదాయిక హిందూ మతాన్ని సంస్కరణావాద నిబద్ధతతో వ్యతిరేకించారు. బ్రాహ్మణ ఛాందస వర్గాన్ని జాతీయ దృక్పథంతోనూ, క్రైస్తవమత ప్రచార దూకుడును హేతువాదంతోనూ వ్యతిరేకించారు."

ప్రొఫెసర్ పోకల లక్ష్మీ నరసు మహత్తర రచన The Essence of Buddhismకి డా. బి.ఆర్. అంబేద్కర్ ముందుమాట రాస్తూ అన్న మాటలివి. కీ.శే. ఏటుకూరి బలరామమూర్తి గారు తెలుగు లోకి అనువాదం చేసిన ఈ మున్నుడిని 1998 లో మిళింద ప్రచురణ గా తీసుకురావడం జరిగింది !

తిరుగులేని కులనిర్మూలన వాదిగా, ఆధునిక నవ బౌద్ధునిగా , విజ్ఞానవేత్తగా , విశేష జ్ఞాన సంపన్నుడిగా, సంఘ సంస్కరణో ద్యమకారుడిగా పోకల లక్ష్మీనరసు నిర్వహించిన బహుముఖ సేవలు విస్తృతమైనవి.జీవితాంతం ఆయన దక్షిణ భారత బౌద్ధ సంఘాలకి అధ్యక్షుడు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు సింగరవేలు చెట్టియర్ తో కల్సి "మహాబోధి సొసైటీ" స్థాపకుడు.సంఘ సంస్కరణ నాయకుడు కందుకూరి వీరేశలింగం ప్రియ శిష్యుడు దేశిరాజు పెదబాపయ్యకి గురుతుల్యుడు.



ఆయన రచనలు ప్రధానంగా నాలుగు,

1. What is Buddhism?
2. A Study of Caste.
3. The essence of Buddhism
4. Religion of the Modern Buddhist

ప్రముఖ తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి 'నాస్తిక ' మిత్రునిగా, ప్రముఖ జాతీయోద్యమ నాయకులు డా.భోగరాజు పట్టబి రామయ్య స్నేహితునిగా,1906 లో మొదటి వర్ణాంతర విందు మొదలుకొని అనేక విప్లవాత్మక సంఘటనలకి ప్రత్యక్ష సాక్షిగా, ఆనాడు ఆధ్యాత్మిక రారాజుగా వెలుగొందుతున్న స్వామి వివేకానందని ముఖాముఖి ఎదుర్కొన్న ధీరుడిగా పి.లక్ష్మీనరసుని గురించి ఎంతో శోధించి ఆయన తెలుగు వాడనే విషయంతో సహా ఎన్నో ఆస్తకికర సంగతులు రాస్తూ2004 లో రవిచంద్ "ఆంధ్ర బౌద్ధ భాష్యకారుడు : ప్రొఫెసర్ పి. లక్ష్మీనరసు" అనే పరిశోధనాత్మక వ్యాసావళి ప్రచురించారు !

ప్రొఫెసర్ పి.ఎల్.నరసు రచనలు ఎంతగా అంబేద్కర్ ని ఆకట్టుకున్నాయంటే వాటినాయన స్వయంగా పునర్ము ద్రించాలనుకున్నారు.

What is Buddhism గ్రంథాన్ని జెకోస్లోవేకియా దేశ తొలి రాష్ట్రపతి జీన్ మాసరిక్ జెక్ భాషలోకి తర్జుమా చేస్తే, తర్వాత జర్మన్ భాషలోకి అనువదించబడిన ఈ గ్రంథాన్ని కీ.శే. ఏటుకూరి బలరామమూర్తి గారిచేత తెలుగు చేయించి కళాతాత్వికులు సంజీవ్ దేవ్ గారిచేత ముందుమాట రాయించి 1996 లో మిళింద ప్రచురణగా తీసుకురావడం జరిగింది !

తైవాన్ దేశపు బౌద్ధ సంఘం వేల లక్షల సంఖ్యలో ప్రచురించి ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో జ్ఞాన పిపాసులకి ఉచితంగా అందజేస్తున్న లక్ష్మీనరసు అద్భుత గ్రంథం The Essence of Buddhismని చంద్రశేఖర్ గారు "బౌద్ధధమ్మ సారం" పేరిట తెలుగు చేసారు ! ఐతే, అంబేద్కర్ కులనిర్మూలన (Annihilation of Caste) పై ప్రభావం చూపిన పి.ఎల్. నరసు. 'కులం – అధ్యయనం (%A study of Caste) , అలాగే ఆధునిక బౌద్ధుని మతం ( Religion of the Modern Buddhist) తెలుగు కావాల్సి ఉంది. ఔత్సాహికులు పూనుకుని ఈ కార్యక్రమం చేస్తే భావోద్యమాలకి ఒక చారిత్రక ఊతమిచ్చినవారౌతారు !

ఆయన రచనలు (ఆంగ్లంలోనివి) అన్నీ ప్రస్తుతం సమ్యక్ ప్రకాశన్ , ఢిల్లీ వారి దగ్గర ఉన్నాయి. ఆధునిక బౌద్ధుని మతం పుస్తకాన్ని గతంలో Critical Quest వారు G. Aloysius ముందుమాటతో ప్రచురించారు. Essence of Buddhism ఇంకా ఇతర గ్రంథాలు నెట్ లో ఉన్న సాఫ్ట్ కాపీల్ని గతంలో చాలా గ్రూప్స్ లో పెట్టాను!

నిబద్ధతతో కృషిచేసే ప్రతీ కులనిర్మూలన వాది, సామాజిక కార్యకర్త పనిగట్టుకుని తప్పకుండా అధ్యయనం చేయాల్సిన వ్యక్తి పోకల లక్ష్మీనరసు. తెలుగు వాడు, ఆంధ్రుడు అయ్యీ ప్రపంచ భావోద్యమకారులెందరినో కదిలించి, బౌద్ధ ఉద్యమాలకి కొత్త ఊపిరులు పోసి జీవితాంతం అణగారిన ప్రజల కోసం, అసమానతలు లేని సమతా వ్యవస్థ కోసం తపించిన అద్వితీయ ప్రతిభావంతుడు పోకల లక్ష్మీనరసు ఈనాటికీ ప్రధాన స్రవంతి భావోద్యమాల్లో విస్మరించబడటం గొప్ప విషాదం !

(**ప్రొఫెసర్ పోకల లక్ష్మీనరసు** 'ఎసెన్స్ ఆఫ్ బుద్దిజం' గ్రంథాన్నే ఆనంద కౌసల్యాయన్ హిందీ లోకి అనువాదం చేసారు. లక్ష్మీనరసు గారి గురించి గతంలో సామాజిక మాధ్యమాల్లో రాసిన నా రైటప్.)

**- గౌరవ్**